క్లుప్తంగా

'సాక్షి'పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

అల్లవరం: సాక్షి కార్యాలయంపై దాడులు చేసిన కూటమి నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అల్లవరం మండల ప్రింట్ మీడియా రిపోర్టర్లు ఎస్సై తిరుమలరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు కె.మురళీకృష్ణ, గంటా అరుణ్‌బాబు, పిండి గణేష్, మధుర శేఖర్ పాల్గొన్నారు.

పొగాకు సేవనం ఆరోగ్యానికి హానికరం



హైస్కూలు సెంటర్‌లో పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

అమలాపురం టౌన్: అనేక దుష్పరిణామాలకు హేతువైన పొగాకు సేవనాన్ని విడనాడాలని నేషనల్ టుబాకో కంట్రోల్ ప్రోగ్రామ్ (ఎన్‌టీసీపీ) అమలాపురం సోషల్ వర్కర్ కొల్లాటి ప్రమీల పిలుపునిచ్చారు. స్థానిక హైస్కూల్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ఆమె బుధవారం అవగాహన కల్పించారు. పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని హైస్కూలు సెంటర్‌లో ఆటోడ్రైవర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు వినియోగం వల్ల కలిగే కష్ట నష్టాలపై అవగాహన కలిగించే వాల్ పోస్టర్లు ఆటో డ్రైవర్లు ప్రదర్శించారు.

రెడ్డిపల్లిలో ఏరువాక పౌర్ణమి



రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందిస్తున్న సర్పంచ్ ప్రసన్న ప్రవీణ్, ఏడీ షంషీ తదితరులు

అమలాపురం రూరల్: మండలం రెడ్డిపల్లిలో ఏరువాక పౌర్ణమిని వ్యవసాయశాఖ అధికారులతో కలసి రైతులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు నాగలికి పూజలు చేశారు. రైతులకు వ్యవసాయ శాఖ ఏడీ ఎంఏ షంషీ, ఏవో కడలి ధర్మ ప్రసాద్ భూసార పరీక్షలకు సంబంధించిన పత్రాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్, మాజీ సర్పంచ్ కరాటం సూర్య భాస్కర్ రావు, నీటి సంఘం డైరెక్టర్ కొలిశెట్టి జయప్రకాష్, వెంకటలక్ష్మి, ప్రేమ్‌కుమార్, అప్పారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

అమలాపురం రూరల్: మండలం నడిపూడి గ్రామంలో సీసీ రోడ్డును ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు బుధవారం ప్రారంభించారు. నూతనంగా నిర్మించే అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, సర్పంచ్ చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు చొల్లంగి సాయిబాబు,మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ మల్లుల పొల్లయ్య పాల్గొన్నారు.

చెత్త సేకరణపై గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న కార్యదర్శి శిరీష

అమలాపురం రూరల్: చెత్త సేకరణపై ఐవీఆర్‌ఎస్ కాల్స్ సమాచారం మేరకు అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి గ్రామ పంచాయతీ వద్ద బుధవారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ తిరికోటి సుజాత అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఈవోపీఆర్డీ మంగాదేవి మాట్లాడుతూ.. ప్రజలు తడి, పొడి చెత్త వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించాలన్నారు. ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రెడ్డి శిరీష తదితరులు పాల్గొన్నారు.

యానాంలో సెంట్రల్ వర్సిటీ కమ్యూనిటీ కాలేజీ

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా మూడు రీజియన్‌లలో యానాం, మాహే, లక్షద్వీప్‌లలో కమ్యూనిటీ కాలేజీలను నెలకొల్పేందుకు పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ నిర్ణయించినట్లు వీసీ ప్రొఫెసర్ పి.ప్రకాశ్‌బాబు బుధవారం విలేకరులకు తెలిపారు. దేశంలో ప్రప్రథమంగా కమ్యూనిటీ కళాశాలలను స్థాపిస్తున్నది పుదుచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీయేనని తెలిపారు. కమ్యూనిటీ కళాశాలల వల్ల స్థానికంగా ఉండే విద్యార్థుల అవసరాలు తీరుతాయన్నారు. మూడుచోట్ల కమ్యూనిటీ కళాశాలల స్థాపనకు భూ కేటాయింపులు కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. వివిధ వృత్తులను నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాల్లో విద్యార్థులకు ఆయా వృతులపై కమ్యూనిటీ కాలేజీల ద్వారా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని ఆ విధంగా తక్షణం ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు.

గట్టు ఎక్కితే గండమే..!

- చినుకు పడితే చిత్తడి
- ప్రమాదకరంగా మందార కాలువగట్టు
- అధ్వాన రహదారులతో రైతుల అగచాట్లు

తాళ్లరేవు: మండలంలోని పలు పంచాయతీలకు సంబంధించి ప్రధాన ఊటకాలువ (మందార కాలువ) గట్లు అత్యంత ప్రమాదకరంగా మారాయి. సుమారు 5 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ కాలువ చెంతన వ్యవసాయం, ఆక్వాకల్చర్ సాగుచేస్తున్నారు. కాగా ఈ కాలువ గట్టుపై ప్రయాణం అంటే నరకప్రాయమే. వర్షం పడిందంటే చాలు రైతుల పరిస్థితి వర్ణనాతీతం. ఏళ్ల తరబడి రైతులు అవస్థలు పడుతున్నా పట్టించుకనే వారు కరువయ్యారు. ఆక్వా రంగానికి, ఆక్వా రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామంటున్న పాలకుల మాటలు నీటిమూటలవుతున్నాయి. వివరాల్లోకి వెళితే పి.మల్లవరం, పోలేకుర్రు, గాడిమొగ, జార్జిపేట, నీలపల్లి పంచాయతీలకు ప్రధాన ఊటకాలువగా ఉన్న మందార కాలువ గట్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇక ఏటిగట్టు రహదారి పరిస్థితి చెప్పనక్కరలేదు. నిత్యం అనేక మంది రైతులు ఈ రహదారుల మీదుగా ప్రయాణిస్తూ ఉంటారు. అయినప్పటికీ కనీసం తాము ప్రయాణించే రహదారులను సైతం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాలలోని ఎన్నో రహదారులను అభివృద్ధి చేయక పోవడంతో రైతులు నిత్యం అవస్థలు పడుతున్నారు. మందార కాలువ గట్టు రహదారితో పాటు దానికి అనుసంధానంగా ఉన్న బాబానగర్, పత్తిగొంది, కొత్తకాలువ, మూడు తూరలు, గాడిమొగ రహదారులు అధ్వానంగా మారాయి. నిత్యం ఈ రహదారుల మీదుగా తాళ్లరేవు, పోలేకుర్రు, గాడిమొగ, పి.మల్లవరం, యానాం తదితర గ్రామాల రైతులు తమ పొలాలకు వెళ్తుంటారు. రహదారులు గోతులు, గొప్పులుగా ఉండడంతో అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా సరకు రవాణా చేయడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు వాపోతున్నారు. వర్షం వచ్చిందంటే ప్రయాణం నరకప్రాయమవుతోంది. సరకు రవాణా సులువుగా జరిగేందుకు మందార కాలువ మధ్యలో వంతెన నిర్మించాలని కోరుతున్నారు. సుమారు వెయ్యి ఎకరాలకు పైగా ఆయకట్టు రైతులు ప్రయాణించే ఈ రహదారిని తక్షణమే అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే బాబానగర్ రహదారి నుంచి మందార కాలువ వరకు అభివృద్ధి చేయడంతో పాటు వంతెన నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

రిలయన్స్, ఓఎన్‌జీసీ ఉన్నా ఫలితం శూన్యం

మందార కాలువ చెంతన రిలయన్స్, ఓఎన్‌జీసీ చమురు సంస్థలు ఉన్నాయి. ఆయా సంస్థల కాలుష్యం బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయినప్పటికీ కనీసం ఆ ప్రాంతానికి మౌలిక సదుపాయాలు గాని, రహదారులను గాని అభివృద్ధి చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రిలయన్స్ సంస్థ నిర్మాణ సమయంలో మందార కాలువను ఆనుకుని అనేక కాలువలు మూసుకుపోయాయని వాటిని యథావిధిగా తవ్వుతామని హామీ ఇచ్చినప్పటికీ వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు చెపుతున్నారు. కనీసం ఆ కాలువలను తవ్వించకపోగా రహదారులను కూడా అభివృద్ధి చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోనే పేరెన్నికగన్న చమురు సంస్థలు ఉన్నప్పటికీ తాము ఇన్ని కష్టాలు పడాలా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా సంస్థల ద్వారా రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా మందార కాలువ గట్టు



కాలువ గట్టుపై అవస్థలు పడుతున్న వాహనచోదకుడు



గోతులు, గొప్పులతో పత్తిగొంది కాలువగట్టు రహదారి

రక్తమిచ్చి ప్రాణాలు కాపాడదాం



అమలాపురంలో సాగుతున్న రక్త దాన అవగాహన ర్యాలీ

అమలాపురం టౌన్: రక్తదానాలు చేసి ప్రాణాలను కాపాడే పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ భరతలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద రక్తదాన అవగాహన ర్యాలీని బుధవారం ఆమె ప్రారంభించారు. ఏరియా ఆస్పత్రి నుంచి నల్ల వంతెన వరకూ ర్యాలీ చైతన్యభరితంగా సాగింది. ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది దొడ్డా కాశి, యల్లమిల్లి రమణమూర్తి, చొల్లంగి రాజశేఖర్, చిట్టిమేను కృష్ణ రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ర్యాలీలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, ఆర్‌ఎంవో డాక్టర్ అనూష, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వలవల శివరావు, ఆవుపాటి గోపాల్ తదితరులు పాల్గొన్నారు. 'రక్తం ఇవ్వండి...ఆశను పంచండి... అందరం కలిసి ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడుదాం' అనే నినాదాలతో ర్యాలీ సాగింది. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలతో ముద్రించిన బ్రోచర్లను ప్రదర్శించారు.

విద్యార్థులకు వసతులు కల్పించాలి

జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

ముమ్మిడివరం: విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని తానేలంక గ్రామంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్లే గ్రౌండ్‌ను ఎత్తు చేయాలని ప్రిన్సిపాల్ జిల్లా కలెక్టర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ రాంజీ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గంగా భవానీ, తహసీల్దార్ సుబ్బలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

22న కాకినాడలో 'గోదావరి కవితా పండగ'



గోదావరి కవితా పండగ, జాతీయ కవి సమ్మేళనం బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నరసింహమూర్తి, ఏబీ నాయుడు

అమలాపురం టౌన్: కాకినాడ పీఆర్ కళాశాల ఆడిటోరియంలో అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఈనెల 22న గోదావరి కవితా పండుగ 149వ జాతీయ ద్విశతాధిక కవి సమ్మేళనం నిర్వహించనున్నట్టు వేదిక కోనసీమ జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి తెలిపారు. ఈ సమ్మేళనం బ్రోచర్లను స్థానిక విద్యానిధి విద్యా సంస్థల కార్యాలయంలో విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు తదితరులతో ఆయన బుధవారం ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళా వేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈ సమ్మేళనం జరుగుతుందని నరసింహమూర్తి తెలిపారు. సాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ సాహిత్య విలువలను కాపాడుతూ ఇప్పటి వరకూ 148 కవి సమ్మేళనాలను నిర్వహించినట్టు ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా 200 మందికి పైగా కవులు ఈ సమ్మేళనానికి హాజరుకానున్నారని పేర్కొన్నారు. జాతీయ కవి సమ్మేళానికి ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించనవసరం లేదని, రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రతీ కవికి జ్ఞాపిక, ప్రశంసా పత్రం, సత్కారం ఉంటాయని నరసింహమూర్తి తెలిపారు.

రైతులు సాగు ఆరంభించాలి



భీమనపల్లిలో నాగలి పట్టి పొలం దున్నుతున్న ఎమ్మెల్యే ఆనందరావు



ఏరువాక పౌర్ణమిలో పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల

ఉప్పలగుప్తం: తొలకరి సాగు సమయం ఆసన్నమవడంతో రైతులు ఖరీఫ్ సాగును ప్రారంభించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయిపాలెంలో ఏరువాక పౌర్ణమిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు నాగలి పట్టి సాగు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు, దేశంశెట్టి లక్ష్మీ నారాయణ, అరిగెల నానాజీ, నల్లా సత్యనారాయణ, ఆకుల వెంకట రెడ్డినాయుడు, గుత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

పాత ఇంజరంలో..

ఐ.పోలవరం: మండల పరిధిలో పాత ఇంజరంలో బుధవారం ఏరువాక పౌర్ణమిలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి అనేది కర్షకుల పండుగ అని ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందదాయకంగా ఉందన్నారు. ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడి రైతులు మంచి ఆదాయాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, టేకుమూడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గోశాలలకు పశుగ్రాసం వితరణ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలోని గోశాలలోని పశువులకు దాతలు బుధవారం పశుగ్రాసాన్ని వితరణగా ఇచ్చారు. రాజమహేంద్రవరానికి చెందిన పద్మనాభుని వెంకట కొండలరావు, స్వర్ణలత దంపతులు 26 మోపుల ఎండుగడ్డిని అందజేశారు. ఈదరాడకు చెందిన కోన చిట్టిబాబు 20 మోపుల గడ్డిని వితరణగా ఇచ్చారు. దాతలను ఆలయ ఈఓ వి.సత్యనారాయణ, ఆలయ ఉద్యోగులు అభినందించారు.

ఆర్టీసీ డీఎంకు ఉత్తమ పురస్కారం

అమలాపురం రూరల్: ఇంధన సామర్థ్యం విభాగంలో 2024- 25 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాలు సాధించిన ఆర్టీసీ అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తికి ఉత్తమ పురస్కారం లభించింది. డిపో గ్యారేజ్ ఆవరణలో బుధవారం జరిగిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభకు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ వాహనాల ఇంధన సామర్థ్యం విభాగంలో లక్ష్యాలు సాధించినందుకు డీఎంకు ఉత్తమ పురస్కారాన్ని ఆయన అందజేశారు. అలాగే వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలతో సత్కరించారు. అసిస్టెంట్ ఇంజినీర్ గంగుమళ్ల రమాలక్ష్మీదేవి, సూపరింటెండెంట్ నరసింహారావు, టెక్నీషిన్లు గౌరీనాథ్, శివన్నారాయణ తదితరులను ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలతో అభినందించారు. ఇంధన సామర్థ్యంలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు పి.రాంబాబు, జె.చంటి, కె.శ్రీనివాసరావు, కె.రమేష్ బాబులకు, అత్యధిక రూట్ ఆదాయం సాధించిన కండక్టర్లు కేడీవీయస్ రాజు, ఎంవీడీ ప్రసాద్, వీఎస్ రావులకు ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందించారు. వీరితో పాటు ఆన్ కాల్ విధానంలో పని చేస్తూ ఇంధన సామర్థ్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు డ్రైవర్లకు ప్రత్యేక బహుమతులను అందించారు. అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమా కుమారి, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎస్.వరహాల బాబు, ట్రాఫిక్, గ్యారేజీ ఉద్యోగులు పాల్గొన్నారు.



డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తికి ఉత్తమ పురస్కారాన్ని అందిస్తున్న ప్రజా రవాణా అధికారి రాఘవకుమార్

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



శిబిరాన్ని సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న దేవాదుల సూర్యనారాయణమూర్తి

అమలాపురం టౌన్: మున్సిపాలిటీ అవుట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె బుధవారంతో 34వ రోజుకు చేరుకుంది. న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈ నెల ఒకటో తేదీ నుంచి తమ విధులను బహిష్కరించి సహాయ నిరాకరణతో సమ్మెను ఉధృతం చేశారు. వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి సమ్మె శిబిరాన్ని బుధవారం సందర్శించి వారి నిరసనకు సంఘీభావం ప్రకటించారు. కార్మికులను పర్మెనెంట్ చేసి వారి జీతాలను పెంచాలని దేవాదుల డిమాండ్ చేశారు. కార్మికులు సమ్మెలో ఉండడం వల్ల ఆయా మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా, వీధి లైట్ల నిర్వహణ అస్తవ్యస్తమై ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు.

టీబీపై అవగాహన

అల్లవరం: జాతీయ క్షయ నిర్మూలనలో భాగంగా దేవగుప్తం పంచాయతీ వద్ద డాక్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం క్షయ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. సర్పంచ్ సాధనాల వెంకటరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ జ్వరం, ఛాతిలో నొప్పి, తెమడతో కూడిన దగ్గు, అలసట, నీరసం, రాత్రిపూట చెమట, బరువు తగ్గడం, శారీరక ఆరోగ్యంలో మార్పులు రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముందుగానే పరీక్షలు చేయించుకోవడం ద్వారా టీబీ నుంచి జీవితాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం 44 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాంబాబు, ఆరోగ్య సిబ్బంది సుధాకర్, మట్టపర్తి వెంకటేశ్వరరావు, దుర్గా ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.



టీబీ నివారణకు ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, తదితరులు

సూర్య ఘర్‌తో విద్యుత్ ఆదా

అల్లవరం: ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా రాయితీపై సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్లు అందిస్తున్నట్టు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. ఏఈ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం ఈ పథకంపై అవగాహన కల్పించారు. ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, 2 కిలో వాట్లకు రూ.60 వేలు, 3 కిలో వాట్ సామర్థ్యం గల యూనిట్‌లకు రూ.78 వేలు రాయితీలో యూనిట్లు అందిస్తుందన్నారు. ఇంటిపై 10 చదరపు మీటర్ల స్థలంలో సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దీని వల్ల విద్యుత్ బిల్లు గణనీయంగా ఆదా అవుతుందని ఏఈ తెలిపారు. ఈ పథకానికి బ్యాంక్ నుంచి రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

'కోరింగ'లో విద్యార్థుల స్టడీ టూర్

అభయారణ్యాన్ని సందర్శించిన చత్తీస్‌ఘడ్ విద్యార్థులు

తాళ్లరేవు: చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఎస్ఐఎఫ్‌టీ విద్యార్థులు ప్రముఖ పర్యాటక ప్రదేశమైన కోరింగ అభయారణ్యాన్ని బుధవారం సందర్శించారు. 45 మంది విద్యార్థులు అభయారణ్యంలోని ప్రముఖ ప్రదేశాలన్నింటినీ ఆసక్తిగా తిలకించారు. మడ అడవుల అందాన్ని తిలకిస్తూ చెక్కల వంతెనలపై నడుస్తూ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం బోటు షికారు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో అభయారణ్యంలోని మడ అడవుల విశిష్టత, పక్షుల వివరాలను ఎఫ్‌బీఓ మహేష్ వారికి వివరించారు. అలాగే తాబేళ్ల సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.వీరభద్రరావు, కె.సిద్ధార్థ, ఎఫ్‌బీఓ జి.గోపి నాగేంద్రకుమార్, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, ఎం.మధుబాబు సీబీఈటీ సిబ్బంది పాల్గొన్నారు.



కోరింగ అభయారణ్యం విశేషాలను విద్యార్థులకు వివరిస్తున్న అటవీ అధికారులు

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: పవిత్ర జ్యేష్ఠ పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పి.మల్లవరం గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు ఖండవిల్లి రాంబాబు, అరుణశ్రీ దంపతులచే అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి శ్రీరంగాచార్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ విళ్ల సత్యనారాయణ, కోశాధికారి పితాని వీరబాబు, ప్రతినిధులు ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి శుభ, పంపన చంద్రరావు, చప్పిడి శ్రీను, చిట్టూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జేఈలకు సత్కారం



ఆర్ఏఓ మునిస్వామిని కలసిన జేఈలు

యానాం: పుదుచ్చేరి విద్యుత్‌శాఖలో జూనియర్ ఇంజినీర్ పోస్టులకు ఎంపికైన యానాంకు చెందిన అభ్యర్థులను బుధవారం ఆర్ఏఓ మునిస్వామి ఘనంగా సత్కరించి అభినందించారు. పుదుచ్చేరి వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 73 జేఈ పోస్టుల భర్తీకి ఈనెల 8వ తేదీన రాతపరీక్ష నిర్వహించారు. ఈ నెల 10వ తేదీన పరీక్ష ఫలితాలను ప్రకటించారు. యానాం నుంచి ఎంపికైన మెల్లం శరత్‌రాజ్, పంపన జ్యోతినారాయణ, కొల్లు శ్రీనివాసు మర్యాదపూర్వకంగా ఆర్ఏఓను కలవగా ఆయన అభినందించారు. అలాగే మద్దింశెట్టి సుభాష్‌చంద్రవ్యాస్, కోన వెంకట అనంత కిరణ్ ఈడబ్ల్యూఎస్ విభాగంలో ఎంపికయ్యారు.

త్వరలో గృహ నిర్మాణం చెక్కులు

యానాం: పుదుచ్చేరి మురికివాడల అభివృద్ధి సంస్థ(స్లమ్ క్లియరెన్స్ బోర్డు) ద్వారా గృహ నిర్మాణాలకు రూ.5 లక్షల ఉచిత రుణం కోసం అధికారులకు దరఖాస్తులు అందజేసినట్టు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తులను అధికారులు పరిశీలించి త్వరలో యానాం వచ్చి గృహనిర్మాణ చెక్కులను అందజేస్తారని తెలిపారు. ఇంకా నూతన గృహాలు నిర్మాణం చేయదలుచుకున్న వివరాలను తెలియజేస్తే వారికి సైతం దరఖాస్తు ఫారాలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా చండీహోమం

ఐ పోలవరం: జేష్ఠ్యమాసం పౌర్ణమి బుధవారం మహాపర్వదినాన్ని పురస్కరించుకుని మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేకేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో విశేషపూజలు చేశారు. తొలుత గణపతి పూజ, మండపారాధన అనంతరం చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి తిథికి భక్తుల గోత్రనామాలతో దేవస్థానం తరపున చండీహోమం నిర్వహిస్తారు. 88 మంది భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్ పర్యవేక్షించగా ఆకొండి కిరణ్ పాల్గొన్నారు.